
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
శుక్రవారం 6 సెప్టెంబరు 2024





గణపయ్యా.. ముస్తాబయ్యా

రేపు వినాయక చవితి

- పోటాపోటీగా మండపాల ఏర్పాటు
- జోరుగా పూజా సామగ్రి, వినాయక ప్రతిమల కొనుగోళ్లు

కొడంగల్‌లో గణనాథులను మండపాలకు తరలిస్తున్న భక్తులు





కొలువు దీరేందుకు సిద్ధంగా ఉన్న గణనాథులు



వినాయక చవితి పండుగ నేపథ్యంలో వాడవాడలా పార్వతీ తనయుడు గణపయ్య కొలువుదీరనున్నాడు. పండుగ నేపథ్యంలో గ్రామాలలో సందడి వాతావరణం నెలకొంది. భక్తి శ్రద్ధలతో నవరాత్రోత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీలు, యువజన సంఘాలు సిద్ధమయ్యాయి. గణనాథుల ప్రతిమల కొనుగోలుతో పాటు మండపాల ఏర్పాట్లలో యువకులు బిజీబిజీగా కన్పించారు. పూజకు అవసరమైన సామగ్రిని భక్తులు కొనుగోలు చేశారు. దీంతో దుకాణాలు కిటకిటలాడాయి. పెద్ద విగ్రహాలను కొనుగోలు చేసేందుకు యువకులు పోటీ పడ్డారు.

- మేడ్చల్, సెప్టెంబరు 4

మొయినాబాద్ మండలం బాసారం జాగీర్‌లో ఏర్పాటు చేసిన భారీ గణనాథుని విగ్రహం

ఉపాధ్యాయులే మార్గదర్శకులు

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- 39 మంది ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

వికారాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని, వారు అందరికీ మార్గదర్శకులని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఏ దేశ భవిష్యత్తు అయినా తరగతి గదిలోనే తయారవుతుందన్నారు. ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి దేశ అత్యున్నతమైన రాష్ట్రపతి పదవిని అధిరోహించిన సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఈ సందర్భంగా నివాళులర్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు వచ్చేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు.



శాసనస్పీకర్ ప్రసాద్‌ను జ్ఞాపికతో సన్మానిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

విద్యకు మించింది ఏదీ లేదు: కలెక్టర్ ప్రతీక్‌జైన్

కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ జీవితంలో విద్యకు మించింది ఏమీ లేదన్నారు. దేశ రూపు రేఖలు విద్య వల్లనే మారుతాయని దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పిన మాటలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదన్నారు. ఎస్పీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభావితం చేయడం వల్లనే సమాజంలో ఈ స్థాయిలో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా 39 మంది ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో ఘనంగా సన్మానించారు. జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, ఉపాధ్యాయ సంఘాల నేతలు కడియాల చంద్రశేఖర్, అమర్‌నాథ్, సత్యనారాయణరెడ్డి, సుదర్శన్, వెంకట్‌రత్నం, అంజిరెడ్డి, ఆరీఫ్, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

- సర్పన్‌పల్లి చెరువులో అక్రమంగా బోటింగ్ హౌస్‌ల నిర్వహణ
- శివసాగర్ బఫర్‌జోన్‌లో విచ్చలవిడిగా లేఅవుట్లు
- కిలోమీటర్ల మేర తాండూరు చిలకవాగు ఆక్రమణ
- చిన్న వర్షానికే కాలనీలు జలమయం
- మాయమైన పరిగి కొత్తకుంట శిఖం భూమి
- ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్న అధికారులు
- ప్రక్షాళన చేయాలంటూ స్థానికుల డిమాండ్



తాండూరులో చిలుక వాగు ఆక్రమణలతో ఇంటిచుట్టూ చేరిన వరద

కబ్జాల పర్వం 7

దర్జాగా.. కబ్జా!

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో యథేచ్ఛగా నిర్మాణాలు

చెరువులు, కుంటలు అన్యాక్రాంతమవుతున్నాయి. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో యథేచ్ఛగా నిర్మాణాలు వెలిశాయి. వికారాబాద్‌లోని సర్పన్‌పల్లి చెరువు, శివసాగర్ చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో పదుల సంఖ్యలో ఫామ్‌హౌస్‌లు వెలిశాయి. వాటి ద్వారా వ్యాపారం నిర్వహిస్తూ అక్రమంగా దండుకుంటున్నారు. సర్పన్‌పల్లి చెరువులో అనుమతులు లేకున్నా బోటింగ్ హౌస్‌లు నిర్వహిస్తున్నారు. తాండూరు చిలుక వాగు పరిస్థితి మరీ దారుణం. పట్టణానికి ముఖద్వారంగా ఉన్న ఈ వాగు కిలోమీటర్ల మేర ఆక్రమణకు గురైంది. దీంతో భారీ వర్షం వస్తే సమీప కాలనీలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఇటీవల ఈ వాగుపై నిర్మించిన అక్రమ నిర్మాణాలపై సర్వే జరిగినప్పటికీ రిపోర్టు వెల్లడి కాకపోవడం గమనార్హం. పరిగి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తకుంట శిఖం భూమిలోనూ నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు ఏర్పాటు చేశారు. అక్కడ గజానికి రూ.35వేల నుంచి రూ.50 వేల వరకు ధర పలుకుతుండడంతో కట్టను సైతం తొలగించి హద్దు రాళ్లు ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించిన పరిస్థితి. అక్రమార్కులు చెరువులను ఇంత దర్జాగా కబ్జా చేస్తున్నా, అధికార యంత్రాంగం మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరిట అక్రమ నిర్మాణాలను తొలగిస్తుండడంతో ఇప్పుడు అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.



కొత్తకుంట కట్టపై వెలసిన నిర్మాణాలు

వికారాబాద్/తాండూరు/పరిగి, సెప్టెంబరు 5: వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శివసాగర్ చెరువు, మండల పరిధిలోని సర్పన్‌పల్లి చెరువు బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు వెలిశాయి. శివసాగర్ చెరువు బఫర్ జోన్ పరిధిలో ఫాంహౌస్‌లు, వెంచర్లు ఏర్పాటు చేయగా, సర్పన్‌పల్లి చెరువులో ఏకంగా ఐదు ఫాంహౌస్‌లు నిర్మించారు. బఫర్ జోన్‌లో నిర్మించిన ఈ ఫాంహౌస్‌లు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. ధనార్జనే లక్ష్యంగా చెరువుల యథేచ్ఛగా కబ్జా చేసి ఫాంహౌస్‌లు నిర్మించారు. ఆహ్లాదం కోసం వచ్చే వారిని ఆకట్టుకునే విధంగా విలాసవంతమైన సదుపాయాలు కల్పిస్తూ అక్రమంగా కోట్లు సంపాదిస్తున్నారు.

అక్రమంగా బోటింగ్ నిర్వహణ

దీనికి తోడు సర్పన్‌పల్లి ప్రాజెక్టు నీటిలో అక్రమంగా నాలుగు బోటింగ్ హౌస్‌లు నిర్మించినా ఇరిగేషన్ అధికారుల కంటికి కనిపించని దుస్థితి. బోటింగ్ హౌసింగ్‌లు నిర్మించిన రిసార్ట్స్ నిర్వాహకులు గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేల మద్దతుతో ఈ నిర్మాణాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఆ రిసార్ట్స్ నిర్వాహకులు సేంద్రియ వ్యవసాయం పేరిట కబ్జా చేసి ఫుల్ ట్యాంక్ లెవల్ పరిధిలోనే బోటింగ్ హౌస్‌లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఆ చెరువులో అక్రమంగా బోటింగ్ నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాగా, ఈ చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్ పరిధిలో ఇతరులు కబ్జాలో ఉంటూ తమ వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే సమీపంలోని డెంటల్ కళాశాల పక్కనే ఏర్పాటు చేసిన వెంచర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నా అధికారులు గుర్తించకపోవడం గమనార్హం. మునిసిపల్ అధికారుల ఉదాసీనతతోనే ఈ విధంగా జరిగిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

తాండూరులో వానొస్తే వరదమయమే

ప్రస్తుతం తాండూరు పట్టణంలో అందరి నోటా వింటున్నది ఒకటే మాట వర్షం

మిగతా 7వ పేజీలో...

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సర్వే చేసి చర్యలు తీసుకుంటాం

- ఆర్డీవో వెంకట మాధవరావు

షాద్‌నగర్, సెప్టెంబరు 5: చెరువుల శిఖం భూమిలో నిర్మించిన పరిశ్రమలు, రియల్ వెంచర్లపై సర్వే నిర్వహించి చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ ఆర్డీవో వెంకటమాధవరావు తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతి పత్రికలో 'చెరువు శిఖం హాంఫట్' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ కథనాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి, ఆయన ఆదేశాల మేరకు శిఖం భూమిలో ఏవైనా అక్రమ నిర్మాణాలుంటే వాటిని తొలగిస్తామన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధి భూములపై ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించి వివరాలు సేకరిస్తున్నామని ఆయన తెలిపారు.



మర్పల్లి మండలం పంచలింగాల గ్రామంలో దెబ్బతిన్న మినప చేను

1,591 ఎకరాల్లో పంటనష్టం

ప్రాథమికంగా అంచనా వేసిన అధికారులు

- రంగారెడ్డిలో 991, వికారాబాద్‌లో 600 ఎకరాలు
- భారీగా దెబ్బతిన్న, పత్తి, వరి పంటలు
- వికారాబాద్‌లో 41 శాతం అధిక వర్షపాతం
- మేడ్చల్‌లో 31 శాతం, రంగారెడ్డిలో 30శాతం అధికం
- ఐదు రోజుల్లోనే సగటుకు మించి వర్షపాతం నమోదు
- రంగారెడ్డి జిల్లాలో తేలని ఉద్యాన పంటల నష్టం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అనేక చోట్ల అపార పంట నష్టం జరిగింది. కొన్ని ప్రాంతాల్లో ఒకే రోజు 15సెం.మీపైగా వర్షపాతం నమోదైంది. దీంతో అనేక చోట్ల సంభవించిన వరదల వల్ల పలు పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. అధికారులు ఆయా గ్రామాల్లో తిరిగి పంటనష్టంపై ప్రాథమిక అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. పత్తి, వరి, జొన్నతో పాటు పలు పంటలకు నష్టం జరిగింది. కూరగాయ పంటలు, పూలతోటలు కూడా భారీగా దెబ్బతిన్నాయి. ఈసీ, మూసీ నదులు పొంగిపొర్లడంతో పరీవాహక ప్రాంతాల్లో ఎక్కువ నష్టం వాటిల్లింది. ఎడతెరపిలేని వర్షాలతో గులాబీ, బంతి తోటలకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. రంగారెడ్డి జిల్లాలో అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం 991 ఎకరాలు, వికారాబాద్ జిల్లాలో 600 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కాగా, రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 524 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పంట నష్టం వివరాలు
(జిల్లాల వారీగా ప్రాథమిక అంచనా ఎకరాల్లో..)

పంట	రంగారెడ్డి	వికారాబాద్
పత్తి	864	400
వరి	89	40
జొన్న	27	15
మొక్కజొన్న	06	15
కందులు	05	70
ఉద్యానం	-	60

ధ్వంసమైన కూరగాయల పంటలు

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా పత్తి పంటకు నష్టం వాటిల్లింది. రంగారెడ్డి జిల్లాలో 864, వికారాబాద్‌లో 400 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. రంగారెడ్డి జిల్లాలో వరుసగా 89 ఎకరాల్లో వరి, 27 ఎకరాల్లో జొన్న అయిదెకారల్లో కంది పంటకు నష్టం జరిగింది. అలాగే వికారాబాద్ జిల్లాలో 70 ఎకరాల్లో కంది, 40 ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయని, జొన్న 15, మొక్కజొన్న 15 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. మరో 60 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం జరిగి ఉండవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. భారీ వర్షాలకు అనేక మండలాల్లో కూరగాయ, పూల, పండ్ల తోటలు ధ్వంసమైయ్యాయి. వీటికి సంబంధించిన ప్రాథమిక నష్టం అంచనాలను అధికారులు సేకరిస్తున్నారు. పంటలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇప్పటికే నష్టపరిహారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10వేల చొప్పున పరిహారం అందచేస్తామని ప్రకటించారు. ఈ మేరకు పంటనష్టం అంచనాలను తేల్చాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ప్రాథమిక పంట నష్టం అంచనాలను ప్రభుత్వానికి పంపారు. వీటి ఆధారంగా త్వరలో రైతులకు నష్టపరిహారం అందించనున్నారు.

5 రోజుల్లోనే నెల సగటుకు మించి

ఈ సీజన్‌లో అతిభారీ వర్షాలు పడడంతో వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సగటు కంటే అధిక వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 493మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా అంతకు మించి 698 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇది సగటు కంటే 41శాతం అధికం కావడం గమనార్హం. అలాగే రంగారెడ్డి జిల్లాలో 407 మిల్లీమీటర్ల వర్షం

మిగతా 7వ పేజీలో...



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్

సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మెరుగైన సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిని ఉన్నతంగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఆదర్శవంతంగా ఉండేలా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 46 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను అందజేసి శాలువాలు, జ్ఞాపికలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, డీఈఓ విజయకుమారి, ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలి

మూడుచింతలపల్లి, సెప్టెంబరు 5: పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించి మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్డీవో సాంబశివరావు అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మండలానికి చెందిన 33 మంది సమాఖ్య మహిళలకు బ్యాక్ వార్డ్ పౌల్ట్రీ పథకం కింద కోడి పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి వద్దనే ఉండే మహిళలను ప్రోత్సహించటానికి ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. పెరటి కోళ్లను పెంచి ఉపాధి పొంద తలచినవారికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. పెరటి కోళ్ళను పెంచేందుకు ప్రభుత్వం తరఫున శిక్షణ అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీలత, ఎంపీఎం మున్న స్వామి, డీపీఎం లత, సీసీలు, వీఏలు, సభ్యులు పాల్గొన్నారు.


పౌల్ట్రీ కిట్లను అందజేస్తున్న డీఆర్డీవో సాంబశివరావు

'ఎస్డీఎఫ్' నిర్మాణాల బిల్లులు చెల్లించాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్

తాండూరు రూరల్, సెప్టెంబరు 5: మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హయాంలో ఎస్డీఎఫ్ కింద చేపట్టిన నిర్మాణాలు పూర్తయ్యాయని, వెంటనే బిల్లులు ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తాండూరు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో రోహిత్‌రెడ్డి హయాంలో రూ.133కోట్లు నిధులు మంజూరు చేయగా, తాండూరు పట్టణంతోపాటు అన్ని మండలాల్లోని 196 గ్రామాల్లో మురుగునీటి కాల్వలు, సీసీ రోడ్లు, హైమాస్ట్ లైట్లు వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పారు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పనులు పూర్తి చేసినా ఇప్పటికీ బిల్లులు రాక ఆత్మహత్య చేసుకునే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నిధులు, బిల్లులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక మంత్రిని కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను గాలికొదిలేసి హైడ్రా పేరిట హైడ్రామాకు తెరలేపిందన్నారు. తాండూరు పట్టణంలో చిలుకవాగు కోసం రూ.16కోట్లు మంజూరు చేయగా, పాలకులను ఇబ్బందులు పెట్టి అప్పటి నిధులను కాంగ్రెస్ ప్రభుత్వమే మంజూరు చేసిన విధంగా పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. అలాగే 36వార్డులకు గాను రూ.36కోట్లను మంజూరు చేయగా, కొన్ని వార్డుల్లో పనులు చేయనప్పటికీ కాంగ్రెస్ నాయకులు తామే నిధులు తీసుకువచ్చామంటూ పనులు చేపడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి(రాజు), సీనియర్ నాయకులు రాజప్పగౌడ్, పట్లోళ్ల నర్సింహులు, నరేందర్‌గౌడ్ తదితరులున్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న రాజుగౌడ్

ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపు

మురుగునీటి కాలువ నిర్మాణం ప్రారంభం

కొత్తూర్, సెప్టెంబరు 5: కొత్తూర్ ప్రధాన రోడ్డు నాలుగు లేన్ల విస్తరణలో భాగంగా ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపునకు అధికారులు పోలీసుల సహకారంతో గురువారం శ్రీకారం చుట్టారు. స్థానిక వైజంక్షన్ నుంచి జ్యోతిరావు పూలే విగ్రహం చౌరస్తా వరకు నాలుగు లేన్ల రహదారిని నెలక్రితం ప్రారంభించారు. రహదారి పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. అయితే, ప్రధాన రోడ్డులో ఉన్నత పాఠశాల ప్రహరీకి ఆనుకొని పలువురు చిరువ్యాపారులు డబ్బాలు వేసుకుని కొన్నేళ్లుగా జీవనం సాగిస్తున్నారు. రోడ్డు విస్తరణలో తమ డబ్బాలు పోకుండా నిర్మాణ పనులు చేపట్టాలని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చారు. దాంతో రహదారికిరువైపులా మురుగునీటి కాలువల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పోలీసుల సహకారంతో ఆర్అండ్‌బీ అధికారులు పనులు ప్రారంభించారు. రహదారి మధ్య నుంచి 50 ఫీట్ల లోపల ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఆర్అండ్‌బీ డీఈఈ రవీందర్‌కుమార్ మాట్లాడుతూ రహదారి మధ్య నుంచి 50ఫీట్లు మాత్రమే తీసుకుంటున్నామని, ఇందుకు చిరువ్యాపారులు సహకరించాలని సూచించారు. మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆటంకాలు కలిగించవద్దని, స్వచ్ఛందంగా డబ్బాలను తొలగించుకోవాలన్నారు. ఆర్అండ్‌బీ ఏఈ మంచిరేవుల రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


కొత్తూర్ ప్రధాన రోడ్డు పక్కన ఆక్రమణలను కూల్చివేయిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

అత్యుత్తమ ప్రమాణాలతో క్రికెట్ అకాడమీ ఏర్పాటు


విద్యార్థినులతో మాట్లాడుతున్న అనంతలక్ష్మి

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 5: కమ్మదనం గురుకుల పాఠశాలలో అత్యుత్తమ ప్రమాణాలతో క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేయనున్నట్లు గురుకులాల జాయింట్ సెక్రటరీ అనంతలక్ష్మి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల పాఠశాలలో జరుగుతున్న బాలికల క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంతో పోటీపడే స్థాయిలో సకల సౌకర్యాలు కల్పించేందుకు గురుకులాల కార్యదర్శి వర్షిణి కృషి చేస్తున్నారని, అందుకోసం 50 మంది సిబ్బందిని కూడా నియమించినట్లు వివరించారు. అనంతరం ఆమె విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాల ఆవరణ, వంట గది, పరిసరాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ విద్యుల్లత పరిస్థితిని, పలు విషయాలు, సమస్యలను ఆమెకు వివరించారు.

మద్యం అమ్మితే రూ.50వేల జరిమానా


కార్యదర్శికి తీర్మాన ప్రతిని అందజేస్తున్న యువకులు

కొందుర్గు, సెప్టెంబరు 5: మండల పరిధిలోని గంగన్నగూడలో ఇకపై మద్యం విక్రయాలు చేపడితే రూ.50వేల జరిమానా వేస్తామని గురువారం గ్రామానికి చెందిన యువకులు తీర్మానం చేశారు. ఈమేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమలతకు తీర్మాన ప్రతిని అందజేశారు. అనంతరం కార్యదర్శితో కలిసి గ్రామంలో ఉన్న 12 బెల్టుషాపుల నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. వినాయక చవితి నుంచి గ్రామంలో మద్యం అమ్మకాలను నిలిపివేయాలని, ఒకవేళ మద్యం విక్రయాలు చేపడితే షాపులపై దాడి చేస్తామని యువకులు హెచ్చరించారు. గ్రామంలో విచ్చల విడిగా బెల్టుషాపులు ఉండడంతో.. మందుబాబులు ఉదయం లేచింది మొదలు.. రాత్రి వరకు తాగుతూ ఇష్టారీతిన గొడవలు సృష్టిస్తున్నారని, గ్రామంలో అశాంతి నెలకొందని యువకులు వాపోయారు. దాదాపు ప్రతీ కుటుంబంలో నిత్యం గొడవలు జరుగుతున్నాయని, పనికి వెళ్లకుండా, మద్యానికి బానిసలుగా మారారని తెలిపారు. మద్యం అమ్మకాలను నిలిపివేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని తీర్మానం చేసినట్లు యువకులు తెలిపారు.

దోమల నివారణ బాధ్యత ఆశా కార్యకర్తలదే

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు


ఆశాలకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న వెంకటేశ్వర్‌రావు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 5 : దోమల నివారణ బాధ్యత ఆశా కార్యకర్తలపైనే ఉందని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొత్తగా నియమించిన ఆశా కార్యకర్తలకు ఎనిమిది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ముగింపు కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాల కారణంగా డెంగీతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వాటిని అరికట్టడంలో ఆశా కార్యకర్తలు ప్రధాన పాత్ర వహించాలని సూచించారు. దీనికోసం తప్పనిసరిగా గృహ సందర్శనలు చేయాలని, ఇంట్లో, పరిసరాల్లో గానీ నిలువ నీరు ఉండకుండా చూసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమలు పుట్టకుండా డ్రైడే.. ఫ్రైడే పాటిస్తూ అవి కుట్టకుండా కిటికీలకు జాలి బిగించుకొని దోమతెరలు వాడేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ, పీవోడీటీ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బోరు నుంచి ఉబికివస్తున్న నీరు

మోటార్ ఆన్ చేయకుండానే వాటర్ రావడంతో రైతు అవాక్కు.

రంగారెడ్డి జిల్లా కమ్మెట గ్రామంలో ఘటన



కమ్మెటలో పొలంలో బోరు నుంచి వస్తున్న నీరు

చేవెళ్ల, సెప్టెంబరు 5 : మోటార్ ఆన్ చేయకుండానే బోరు నుంచి నీరు వస్తుండటంతో రైతు అవాక్కయ్యాడు. ఇటీవల కురిసిన ఎడతెరిపిలేని వర్షాలకు వ్యవసాయ బోరు పంప్ నుంచి నీరు పైకి ఉబికి వస్తుండటంతో రైతులు ఆశ్చర్యానికి గురయ్యారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కమ్మెట గ్రామానికి చెందిన గోపాల్‌కు వ్యవసాయ పొలం బోరు ఉంది. దానికి బిగించిన పైప్ నుంచి రెండు రోజులుగా మోటార్ ఆన్ చేయకుండానే భూమిలోంచి నీరు బయటకు వస్తుండటం చూసి ఆ రైతు నివ్వెరపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామంలోని రైతులు బోరు నుంచి పైకి వస్తున్న నీటిని చూసి ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా భూమిలోంచి నీరు పైకి ఉబికి వస్తుందని రైతులు తెలిపారు. గతంలో కూడా బోరు నుంచి నీరు పైకి వచ్చిన ఘటనను పలువురు రైతులు గుర్తుచేసుకున్నారు. కాగా, గోపాల్ ఆ నీటినంతా వరి పొలంలోకి మళ్లిస్తున్నట్లు తెలిపాడు.

నేడు హైదరాబాద్‌కు పారా ఒలంపిక్స్ కాంస్య పతక విజేత దీప్తి

ఘన స్వాగతం పలకనున్న స్పోర్ట్స్ ఆథారిటీ

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 5 : ప్యారిస్‌లో జరిగిన పారా ఒలపింక్స్-2024లో కాంస్య పతకం సాధించిన దీప్తి జీవన్ నేడు హైదరాబాద్‌కు రానున్నట్లు తెలంగాణ స్పోర్ట్స్ ఆథారిటీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈమేరకు యూకే నుంచి విస్తారా విమానంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆమెకు ఘనంగా స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్పోర్ట్స్ ఆథారిటీ అధికారి ఒకరు తెలిపారు. ఆమెకు స్వాగతం పలకడానికి వివిధ విభాగాల క్రీడాకారులు ఎయిర్‌పోర్టుకు రానున్నట్లు పేర్కొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా మద్యం పట్టివేత

రూ.12 లక్షలు విలువైన ఆల్కహాల్ సీజ్



ఎయిర్‌పోర్టులో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 5 : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోవా నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటలకు వరకు తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో వివిధ బ్రాండ్‌లకు చెందిన 415 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. 352.68 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం విలువ దాదాపు రూ.12 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. కాగా, కొన్ని సంవత్సరాల నుంచి గోవా, ఇతర ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టులోకి మద్యం అనుమతించడం లేదని, ఎవరైనా అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. ఎయిర్‌పోర్టులో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఉత్తమ టీచర్లకు పురస్కారం




పెద్దేముల్/వికారాబాద్ : పురస్కారాలు అందుకుంటున్న ఉపాధ్యాయుడు వడిచర్ల సత్యం, లెక్చరర్ నరేష్

పెద్దేముల్/వికారాబాద్ సెప్టెంబరు 5 : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ఉత్తమ టీచర్లకు రవీంద్రభారతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో గురువారం పురస్కారాలు అందజేశారు. ఈమేరకు పెద్దేముల్ మండలం కందనెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వడిచర్ల సత్యంకు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి శ్రీ దేవసేన పురస్కారం అందజేసి సన్మానించారు. కాగా, ఆయన స్కూల్ అసిస్టెంట్(తెలుగు)గా పనిచేస్తున్నారు. అలాగే ఉన్నత, సాంకేతిక విద్య కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్ విద్యా శాఖ డైరెక్టర్ శృతి ఓజాల నుంచి నవాబ్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ నరేష్ అవార్డు అందుకున్నారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అబ్దుల్ హమీద్

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట జూనియర్ కళాశాల పిన్సిపాల్ అబ్దుల్ హమీద్ ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన పురస్కారం అందజేశారు.

విధులకు హాజరుకాని డాక్టర్‌పై ఫిర్యాదు



నాగసమందర్ పీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న ఏఎన్‌ఎం

ధారూరు, సెప్టెంబరు 5: మండల పరిధిలోని నాగసమందర్ పీహెచ్‌సీలో డాక్టర్ విధులకు హాజరుకావటం లేదని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ రవీంద్ర నాయక్‌కు మాజీ వైస్ ఎంపీపీ వి.మల్లికార్జున్ గురువారం ఫిర్యాదు చేశారు. ఇటీవల ఆసుపత్రికి కొత్తగా వచ్చిన డాక్టర్ మూడు రోజులుగా విధులకు రావటం లేదని మాజీ వైస్ ఎంపీపీకి రోగులు తెలుపడంతో జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేయగా స్పందించలేదు. దాంతో ఆయన వైద్యారోగ్య శాఖ డైరెక్టర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన రవీంద్ర నాయక్ ఆసుపత్రికి జిల్లా ఉప వైద్యాధికారి జీవరాజ్‌ను పంపించారు. ఆయన ఇక్కడి పరిస్థితులపై సిబ్బందిని, రోగులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ రాకపోవటంతో ఏఎన్‌ఎం రోగులకు పరీక్షలు చేసి మందులు ఇస్తోందని స్థానికులు వివరించారు. కాగా, డాక్టర్ రెగ్యులర్‌గా విధులకు వచ్చేలా చర్యలు తీసుకుంటామని, స్టాఫ్ నర్సును కూడా నియమిస్తామని రోగులకు హామీ ఇచ్చారు.

'మమ్మల్ని అకారణంగా తొలగించారు'



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు సమస్యను వివరిస్తున్న పార్ట్‌టైం గురుకుల టీచర్లు

వికారాబాద్, సెప్టెంబరు 5 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో చాలాకాలంగా పనిచేస్తున్న తమ ను అకారణంగా తొలగించడం అన్యాయమని పలువురు పార్ట్‌టైమ్ టీచర్లు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గురుపూజోత్సవానికి హాజరైన ఆయనకు వారు వినతిపత్రం అందజేసి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రెగ్యులర్ టీచర్లతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తమను.. అకస్మాత్తుగా తొలగించడంతో కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాపోయారు. ఈ అంశాన్ని మానవతా దృక్పథంతో పరిశీలించి తిరిగి విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.

దర్జాగా.. కబ్జా!



శివసాగర్ చెరువు బఫర్ జోన్‌లో ఏర్పాటు చేసిన వెంచర్

● 5వ పేజీ తరువాయి

కురిసిందంటే కాలనీలన్నీ వరద మయం కావడంతోపాటు ప్రధాన రోడ్డంతా చెరువును తలపిస్తుంది. తాండూరు పట్టణానికి ముఖద్వారంగా చిలుక వాగు ఉంది. పట్టణ విస్తరణ జరగక ముందు ఇది వరద కాలువగా ఉండేది. చిలుక వాగు సుమారు 10 కిలోమీటర్లకు పైగా విస్తరించి ఉంది. ప్రసుత్తం హైదరాబాద్ రోడ్డు నుంచి కోకట్ రోడ్డు మీదుగా కొడంగల్ రోడ్డు వరకు అడుగడుగునా ఆక్రమణలకు గురైంది. గత వర్షాకాలంలో ఏర్పడిన సమస్యనే మళ్లీ ఇప్పుడు ఎదురవుతుంది. వరద నీరు వెళ్లేందుకు కాలువలు లేక భారీ వర్షం కురిసినప్పుడు కాలనీలు ముంపునకు గురవుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా

కొత్తకుంట పరిగి- హైదరాబాద్ రహదారికి అనుకుని ఉంది. అక్కడ గజానికి రూ.35 నుంచి రూ.50 వేల వరకు ధర పలుకుతుండడంతో కట్టను పూర్తిగా తొలగించి హద్దు రాళ్ల ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించారు. అలాగే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో కూడా అనేక నిర్మాణాలు చేపట్టారు. ఈ శిఖం కబ్జా గురించి గతంలో ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. కొత్తకుంట శిఖం పట్టా పలుకుబడి గల వ్యక్తులది కావడంతో చర్యలకు వెనుకాడుతున్నారనే ఆరోణలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే, పరిగి మునిసిపల్ పరిధిలో పట్టా భూముల్లో కొనసాగుతున్న కుంటల పరిధిలో కూడా అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాల గురించి అధికారులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

వెల్లడికాని సర్వే రిపోర్టు

ఈ వాగు ఆక్రమణలతో తాండూరు పట్టణంలోని సాయిపూర్ ప్రాంతం పూర్తిగా జలమయమవుతోంది. ఆదర్శనగర్, తాతాగుడి కింది భాగం, కోకట్ రోడ్డు, మిత్రానగర్, గ్రీన్ సిటీ, అయ్యప్పనగర్ ప్రాంతాలలో పాటు హైదరాబాద్ రోడ్డు మార్గం పక్కనున్న కాలనీలు, పాలిషింగ్ యూనిట్లు వరద నీటితో నిండిపోతున్నాయి. పట్టణం విస్తరిస్తున్న కొద్దీ ఈ సమస్య మరింత పెరుగుతోంది. రెండు నెలలుగా చిలుక వాగు సమస్యపై సమీక్షలు, సర్వేలు జరుగుతున్నా ఫలితం మాత్రం శూన్యం. ఆ వరద కాలువను అక్రమంగా ఆక్రమించుకుని అనేక ఇళ్లు, షెడ్ల నిర్మాణాలు చేపట్టారు. పక్కనున్న పొలాలు వారు కూడా దీన్ని ఆక్రమించారు. రెండు నెలల కిందట ఎమ్మెల్యే ఆదేశం మేరకు రెవెన్యూ, ఇరిగేషన్, మునిసిపల్ శాఖల ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. కానీ, రిపోర్టు ఇప్పటి వరకు అందజేయలేదు. అడ్డంకిగా ఉన్న అక్రమ నిర్మాణాల జాబితాను అధికారులు సిద్ధం చేయలేదని, ఇందుకు రాజకీయ వత్తిళ్లే కారణంగా తెలుస్తోంది.

పరిగి కొత్తకుంట శిఖంలో యథేచ్ఛగా వెంచర్లు

పరిగి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తకుంట శిఖం భూమిలో నిబంధనలను విరుద్ధంగా వెంచర్ చేసి ప్లాట్లు విక్రయించారు. అక్కడ ఇళ్ల నిర్మాణాలు కూడా చకచకా జరిగిపోతున్నాయి. పరిగి శివారులోని సర్వేనంబర్ 255లో దాదాపు 15 ఎకరాల శిఖం భూమి ఉండగా, దీని కింద 30 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. అయితే పరిగి పట్టణం విస్తరిస్తుండడంతో కొత్తకుంట శిఖం స్థలానికి డిమాండ్ బాగా పెరిగింది. శిఖం పట్టా యజమానిగా చెప్పుకుంటున్న కొందరు వ్యక్తులు ఆ కట్టను యంత్రాలతో తొలగించారు. శిఖం లోపలి భాగం నుంచి కాలువ తీసి కట్టను ఓ చోట పూర్తిగా తొలగించి వర్షం నీరు బయటకు వెళ్లిపోయే విధంగా చేసి, దాంట్లో పాట్లు చేసి ప్లాట్లను విక్రయించారు.

కుటుంబ కలహాలకు తల్లీ కొడుకు బలి

- లభించని కూతురు ఆచూకీ
- ఇద్దరు పిల్లలను చెరువులోకి తోసి దూకిన తల్లి
- తల్లీ కుమారుడి మృతదేహాలు లభ్యం
- కూతురు ఆచూకీ కోసం పోలీసుల గాలింపు



ప్రాణాలతో బయటపడ్డ విఘ్నేష్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 5: భార్య భర్తల కలహాలు ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశాయి. తల్లి కొడుకు మృత్యువు పాలవ్వగా, కూతురు జాడ దొరకకుండా పోయింది. భర్తతో కలహాలతో ఓ తల్లి తన ఇద్దరు కొడుకులు, కూతురుతో గురువారం రాత్రి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు వెళ్లింది. ఓ కొడుకు, కూతురును ఆ చెరువులోకి తోసింది. తర్వాత తానూ దూకింది. ఈ ఘటనలో తల్లి, కుమారుడు మరణించాడు. వారి మృతదేహాలను పోలీసులు వెలికి తీశారు. అయితే, కూతురు జాడ మాత్రం తెలియకుండా పోయింది. ఆమె కోసం పోలీసులు చెరువులో ముమ్మరంగా గాలిస్తున్నారు. అయితే, ముగ్గురు పిల్లలతో చెరువు వద్దకు చేరిన ఆ తల్లి ఇద్దరిని మాత్రమే చెరువులోకి తోసి ఒక కుమారుడిని ఎందుకు వదిలివేసిందో ఎవరికీ అంతుచిక్కడం లేదు. వివరాల్లోకి వెళితే.. వనస్థలిపురం సంపూర్ణ థియేటర్ కూరగాయల మార్కెట్ దగ్గర నివాసముంటున్న ఒరుసు కుమార్‌కు భార్య మంగ (35), కూతురు లావణ్య (15), కుమారులు విఘ్నేష్ (5) శరత్ (7)లు ఉన్నారు. గురువారం రాత్రి 7.30 గంటల ప్రాంతలో మంగ తన పిల్లలను తీసుకొని బస్సులో ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు చేరుకుంది. పెద్ద తూము కింద మెట్ల వెంట కిందికి దిగిన మంగ.. కూతురు లావణ్య, కుమారుడు శరత్‌ను నీళ్లలో తోసి తాను కూడా నీళ్లలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, మరో కుమారుడు విఘ్నేష్ మాత్రం తప్పించుకొని ఒడ్డునే ఉండి ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది గాలింపు చేపట్టగా.. మంగ, శరత్‌ల మృతదేహాలు లభ్యమైనాయి. లావణ్య మృతదేహం లభ్యం కాలేదు. కాగా లావణ్య, శరత్, విఘ్నేష్ (ఎల్‌కేజీ)లు వనస్థలిపురం ప్రశాంతి విద్యానికేతన్ స్కూల్‌లో చదువుతున్నారు. కుమార్ దంపతులు రాయికొట్టి జీవనం సాగిస్తున్నారని తెలిసింది. మూడు, నాలుగు రోజులుగా ఇంట్లో భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని సమాచారం. దాంతో పిల్లలను స్కూలు నుంచి తీసుకువస్తానని చెప్పి మంగ.. వారిని తీసుకొని నేరుగా ఇబ్రహీంపట్నం వచ్చినట్లు బంధువులు తెలిపారు. కాగా కుమార్, మంగలది రెండో వివాహమని అప్పటికే ఇద్దరికీ పెళ్లిళ్ల కాగా.. విడాకులు తీసుకుని పెళ్లి చేసుకున్నారు.. కూతురు లావణ్య మంగ మొదటి భర్త సంతానమని సమాచారం. సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



నవాబుపేట మండలం కొమ్మెరగూడలో కూలిన ఇంటి వద్ద బాధితురాలు

నవాబుపేట, సెప్టెంబరు 5: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జనం బెంబేలెత్తిపోయారు. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అదేవిధంగా నవాబుపేట మండలంలోని కొమ్మెరగూడ గ్రామానికి చెందిన అంజమ్మ ఇల్లు కూలిపోయింది. కాగా, గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు ఇల్లు సగభాగం కూలిపోవడంతో నిరాశ్రయులైనట్లు బాధితురాలు వాపోయింది. తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటోంది.

ఆదర్శ కష్టాలు!

- మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేసిన లేఅవుట్‌లో వరద బాధలు
- ఆదర్శనగర్ కాలనీలో అభివృద్ధి ఏది!
- పట్టించుకోని పాలకులు, అధికారులు



నీటిలో నడుచుకుంటూ వెళ్తున్న కౌన్సిలర్ నీరజా బాల్‌రెడ్డి (ఫైల్)

తాండూరు, సెప్టెంబరు 5: తాండూరు మున్సిపాలిటీలో ఇది ప్రత్యేక కాలనీ. సాక్షాత్తు మున్సిపాలిటీ అధికారులే లేఅవుట్ చేసి విక్రయించిన ప్లాట్లు అవి. వాటిని విక్రయించి కూడా రెండు దశాబ్దాలు దాటింది. కానీ, ఆదర్శనగర్ కాలనీ అభివృద్ధి నోచుకోక పోగా.. వరద కష్టాలతో వర్షాకాలం కష్టాలు తప్పడం లేదు. తాండూరు పట్టణంలోని సర్వే నంబర్ 139, 140లలో 21 ఎకరాల పాత కుంటను 1996లో ప్రభుత్వం ఆదర్శనగర్‌గా మార్చి అప్రూవల్ లేఅవుట్‌గా మార్పు చేసింది. పాత కుంట ఐడీఎస్ఎంటీ పథకం కింద పురపాలక సంఘ నియమాలను అనుసరించి 180 ప్లాట్లుగా విభజించారు. ఇందులో యుఐజీ 43, ఎల్ఐజీ 118, ఈడబ్ల్యూఎస్ 21 ప్లాట్లు చేసి 2003 ఏప్రిల్ 29న బహిరంగ వేలం నిర్వహించి మున్సిపల్ అధికారులే విక్రయించారు. దశాబ్ద కాలంలో ఆదర్శనగర్ పాత కుంట కుదించడంతో కాలనీవాసులు పక్క కాలనీ వాసులు వర్షపు నీటి నిల్వతో కష్టాలు పడుతున్నారు. తాండూరు పట్టణంలోని పలు ప్రాంతాల వర్షపు నీరు, మురుగు ఈ కుంటలో చేరి ప్రస్తుతం కాలనీలో అప్ప టి పాతకుంట కాల్వలు ముసుకుపోయాయి. ఆక్రమణలకు గురయ్యాయి. ప్లాట్లు విక్రయించి కుంటను కనుమరుగు చేయడంతో వర్షాకాలంలో అక్కడి ప్రజలు వరద నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. గతనెల 31న అర్ధరాత్రి, ఈ నెల 1, 2వ తేదీల్లో కురిసిన భారీ వర్షలకు ఆదర్శనగర్ కాలనీ మొత్తం జలమయమైయింది. కొన్ని గంటల పాటు కాలనీవాసులు బయటకి రాలేని పరిస్థితి నెలకొంది. వరద నీటిని నిల్వ ఉం డకుండా దారి మళ్లింపు చర్యలు చేపట్టకపోవడం, శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికను మున్సిపాలిటీ అధికారులు రూపొందించకపోవడంతో కాల నీ ప్రజలకు శాపంగా మారింది. లేఅవుట్, మాస్ట ర్ ప్లాన్ ప్రకారం కాలనీ ప్రణాళికను రూపొందించాలని, కాలనీలోకి వచ్చే వరద నీటిని దారి మళ్లించాలని కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నా రు. ఐదెకరాల పార్కు స్థలం పరిసర ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా వారు కోరుతున్నారు.

కాలనీ ప్రత్యేకతలు ఏమయ్యాయి

ప్లాట్లు కొనుగోలు చేసే సమయంలో మున్సిపాలిటీ అధికారులు ఈ కాలనీకి పలు ప్రత్యేకతలు ప్రకటించారు. పట్టణంలోని ప్రథమంగా అన్ని సదుపాయలు.. రోడ్లు, మురికినీటి కాల్వలు, డ్రైనేజీ, విద్యుత్ సదుపాయం, పర్యావరణాన్ని పరిరక్షించడానికి రూ.89.51 లక్షలతో సెంట్రల్ పార్కు నిర్మాణం చేపడతామని ప్రకటించారు. ఏ ఒక్కటీ చేపట్టలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

పీహెచ్‌సీలో గడువుదాటిన మందులు

- అస్తవ్యస్తంగా రికార్డుల మెయింటెనెన్స్
- డీఎంహెచ్‌వో ఆగ్రహం.. విచారణకు ఆదేశం



పెద్దేముల్ పీహెచ్‌సీ ఫార్మసీ గదిలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పెద్దేముల్, సెప్టెంబరు 5: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులన్నీ అస్తవ్యస్తంగా మారాయి. గడువు దాటిన మందులు ఉన్నా అవేమీ పట్టించుకోకుండా వదిలేశారు. ఏడాది కాలంగా మందులు వివరాలు కూడా నమోదు చేయడం లేదు. ఇదంతా గురువారం డీఎంఅండ్‌హెచ్‌వో పరిశీలనలో బయటపడడంతో సిబ్బందిపై ఆయన మండిపడ్డారు. పూర్తిస్థాయి విచారణకు డీడీఎంహెచ్‌వోను ఆదేశించారు. పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీడీఎంహెచ్‌వో రవీందర్‌యాదవ్‌తో కలిసి డీఎంఅండ్‌హెచ్‌వో పాల్వన్‌కుమార్ సందర్శించారు. మెడికల్ ఆఫీసర్, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. మందులు నిల్వ ఉంచే గదిని పరిశీలించి వివరాలు నమోదు చేసే రికార్డులను తనిఖీ చేశారు. అవన్నీఏ అస్తవ్యస్తంగా ఉండడంతో ఆశ్చర్యపోయారు. ఏడాది కాలంగా ఆరోగ్య కేంద్రానికి వచ్చిన మందులు ఏమిటి? ఎన్ని వచ్చాయనే వివరాలను రికార్డుల్లో నమోదు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోలిక్‌యాసిడ్ మందు డబ్బాలను పరిశీలించగా గడువుదాటిపోయి నాలుగు నెలలు గడుస్తున్నా చూసుకోకపోవడంపై మండిపడ్డారు. అసలు మీరు పని చేస్తున్నారా? అని ఫార్మసిస్టుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని సహించబోనన్నారు. మీ మెడికల్ ఆఫీసర్ రికార్డులు పరిశీలించలేదా అని ప్రశ్నించారు. ఆస్పత్రికి ఏ నెలలో ఏయే మందులు వచ్చాయి? వాటి పంపిణీ వివరాలు ఏమిటనేది పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డీడీఎంఅండ్‌హెచ్‌వో రవీందర్‌నాయక్‌ను ఆదేశించారు. విచారణానంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, యూపీఎస్సీ, సీఎస్సీ, బస్తీ దవాఖానాల్లో కలిపి మొత్తం 33 మంది వైద్యులు అవసరమని, ప్రస్తుతం 20 మంది పనిచేస్తున్నారని, మరో 13 ఖాళీలున్నాయన్నారు. వాటిలో 12 మందిని భర్తీచేసేందుకు ఇంటర్వ్యూలకు పిలిచామన్నారు. త్వరలో అన్ని పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. డీపీహెచ్‌ఎంవో చండీశ్వరి, డాక్టర్ ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

1,591 ఎకరాల్లో పంటనష్టం

● 5వ పేజీ తరువాయి

కురవాల్సి ఉండగా అంతకు మించి అంటే 525 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక్కడ దాదాపు 30శాతం అధిక వర్షపాతం నమోదైంది. అలాగే మేడ్చల్ జిల్లాలో 472.4 మి.మీ వర్షం కురువాల్సి ఉండగా అంతకుమించి 621 మి.మీ వర్షం పడింది. సగటు కంటే ఇక్కడ 31శాతం అధిక వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లాలో సెప్టెంబర్ నెల అయిదు రోజుల్లోనే నెల సగటు కంటే అధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. సెప్టెంబర్ నెలలో మొత్తం సగటు 212 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 5వ తేదీ నాటికే అంతకు మించి 138 మి.మీ వర్షం కురిసింది.

చౌడాపూర్‌లో 235శాతం అధిక వర్షపాతం

వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఇక్కడ సగటు కంటే 235 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. అలాగే రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో 100శాతం, ఆమన్‌గల్లులో 80శాతం, నందిగామలో 68శాతం అధిక వర్షపాతం నమోదైంది. కొడంగల్ మండలంలో 66శాతం, బొమ్మరాశిపేట, దుండిగల్‌లలో 60శాతం, యాలాల్‌లో 59శాతం, శంకరపల్లిలో 57శాతం, కుల్కచర్లలో 54శాతం, మోమిన్‌పేట, బషీరాబాద్, కేశంపేటలలో 53శాతం, తాండూరు, ఘట్‌కేసర్‌లలో 50శాతం అధికంగా వర్షాలు కురిశాయి.

'ఇందిరా మహిళా శక్తి' లక్ష్యాలను పూర్తి చేయాలి

● కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఇందిరా మహిళా శక్తి పథకాలను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసి, లబ్దిదారులకు లబ్ది చేకూరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారులను కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న 12 అంశాలపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా మహిళా సంఘాల సభ్యులు, సాధారణ పెట్టుబడి సమూహాలు, సూక్ష్మ సంస్థల ద్వారా 7 కొత్త యూనిట్లైన బ్యూటీషియన్, మైక్ అండ్ లైటింగ్, డెకరేషన్, ఫుడ్ క్యాంటీన్, ఫొటోగ్రఫీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, యూనిట్స్ టార్గెట్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఈ యూనిట్లను కలిపి గ్రూపులుగా ఏర్పాటు చేసి గ్రూప్ టార్గెట్లను పూర్తి చేయాలన్నారు. వీటిలో ఫుడ్ క్యాంటీన్లకు స్థల సమస్య ఉంటే మొబైల్ ఫుడ్ కోర్టులను తీసుకోవాలన్నారు. ఈ పనులన్నింటినీ నవంబరు చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాంబశివరావు, మెప్మా పీడీ, అధికారులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఎస్‌ఎఫ్‌సీ చైర్మన్ గోలి


ఆమనగల్లు , సెప్టెంబరు 5: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను గురువారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు ఆయన కమిషన్ సభ్యులతో రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. గవర్నర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు గోలి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఫుడ్ కమిషన్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను గవర్నర్ జిష్ణుదేవ్‌కు వివరించినట్లు గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, గోవర్దన్, శారద, బూక్య జ్యోతి, భారతి తదితరులు ఉన్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోలి శ్రీనివాస్ రెడ్డి

వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం

పెద్ద మొత్తంలో దెబ్బతిన్న పత్తి పంట



పత్తి పంటలో నిలిచిన నీరు

మర్పల్లి, సెప్టెంబరు 5: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు మర్పల్లి మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన మినుము, పెసర పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం పూత, కాత దశలో ఉన్న పత్తి పంటకు తీరని నష్ట జరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంది పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో పంట ఎదుగుదల లేక గిట్టబారుతుందని వాపోయారు. మర్పల్లి మండలంలోని సిరిపురం, పంచలింగాల, కొత్లాపూర్, పట్లూర్, కొంశెట్టిపల్లి, మల్లికార్జునగిరి గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పత్తి, మినుము, కంది పంటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. చేతికొచ్చిన టమాట పంట భారీ వర్షాలతో దెబ్బతిని మార్కెట్‌లో కొనుగోలు చేసే వారు కరువయ్యారని తెలిపారు. టమాట కిలో రూ.20 పలకగా దెబ్బతిన్న టమాటను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదంటున్నారు.

రుణమాఫీ సర్వేలో వ్యవసాయాధికారులు

ఓ వైపు భారీ వర్షాలతో రైతులు నష్టానికి గురవుతుంటే కనీసం వారిని పలకరించే అధికారులే కరువయ్యారు. వర్షాలతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో బాగు చేసుకుందామనుకుంటే అధికారులు వేదికల్లో రుణమాఫీ సర్వేలో బిజీబిజీగా ఉన్నారని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం దెబ్బతిన్న పంటకు రూ.10 వేలు సాయం ప్రకటిస్తున్నా.. నివేదిక పంపించే అధికారులు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శప్రాయులు


పరిగి: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తదితరులు


వికారాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకల్లో అధ్యాపకులు


కొడంగల్: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పరిగి, సెప్టెంబరు 5: ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శప్రాయులని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పరిగి, దోమ, పూడూరు మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు గురువారం పరిగిలోని కేఏఆర్ గార్డెన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరిగి, దోమ, పూడూరు మండలాల ఎంఈవో హరిశ్చందర్, ఎంపీడీవో కరీం, దోమ మాజీ ఎంపీపీ అనసూయ, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, కె.హన్మంత్‌ముదిరాజ్, బి.పరశురాంరెడ్డి, ఈ.కృష్ణ, డి.అమర్‌నాథ్ పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా మిట్టకోడూరు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.శ్రీనివాస్ ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో సన్మానం పొందారు. స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ల చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

కొడంగల్: కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మురారివశిష్ఠ, కార్యదర్శి శివకుమార్‌గుప్త, ఎంఈవో రాంరెడ్డి ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన దుద్యాల జీహెచ్‌ఎం విజయ రామారావు, భారతి, వెంకటేశం, పరమేశ్వరి, భవాని, వెంకటయ్య, రత్నకళ, ఆశమ్మ, సుభాష్‌రెడ్డిలను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు రాములు, మాసాని వెంకటయ్య, పాఠశాల వ్యవస్థాపకుడు డి.వెంకటయ్య, ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోషలను విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హకీం, జనార్దన్, అతిఖ్, ప్రభాకర్, సంతోష్, శకుంతల, నాగేంద్రమ్మ, మేహరాజ్‌బేగం పాల్గొన్నారు.

వికారాబాద్: దేశాభివృద్ధిలో అధ్యాపకులు ఎంతో కీలక భూమిక పోషిస్తున్నారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ గీతాలక్ష్మీ పట్నాయక్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని గురువారం కళాశాలలో ఉపాధ్యాయ దినోతవ్సం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రిన్సిపాల్, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ధారూరు: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పీఆర్టీయూ నాయకులు గురువారం ధారూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఉపాధ్యాయుడు ఎస్.వీరప్పను వారు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ సంఘం నాయకులు శ్రీనివాస్, మల్లికార్జున్, మాణిక్యం, శ్రీనివాస్ రెడ్డి, శివప్రసాద్, బీ.శ్రీనివాస్, సుధాకర్, పోమశంకర్ పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

కులకచర్ల: మండల పరిధిలోని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మండల పరిధిలోని పలు పాఠశాలల్లోని ఉపాధ్యాయులను సన్మానించారు.

దోమ: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూపాలక్ష్మి సేవ్యానాయక్, నవీన్, నందిని, నవనీత, అనూష, శిరీష, జునేద్, ప్రవీణ్, నవీన్, రామరాజు, నందిని, లక్ష్మి పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: ఉపాధ్యాయులు సమాజ మార్గ దర్శకులని రెయిన్‌బో పాఠశాల కరస్పాండెంట్ పి.రాఘవేందర్ యాదవ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హైమద్, రాములు, పార్వతీ, స్వరూప, శ్రీవాణి, కవిత, యాదమ్మ, నవనీత, అపర్ణ, సన పాల్గొన్నారు. అదేవిధంగా దుద్యాలలోని నేతాజీ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్వేత, రఘు, జయశ్రీ, పద్మ పాల్గొన్నారు. అదేవిధంగా జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు.

కొడంగల్ రూరల్: కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థులు అధ్యాపకులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రఫియాఖానమ్ బహుమతులను అందజేశారు.

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు బాబుసింగ్, ప్రభాకర్, వీరన్న, ఎస్బీఐ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

తాండూరు: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని తనకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయుడు నాగయ్య దంపతులకు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి గురువారం మట్టి గణపతి బహూకరించి సన్మానించారు.

ఉపాధ్యాయుల చేతిలో దేశ భవిష్యత్తు

మేడ్చల్ టౌన్: దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలో ఉందని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి జె.త్రిశూల్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉత్తమ ఉపాధ్యాయులును ఎంపిక చేసి సన్మానించారు. ఈ సందర్భంగా త్రిశూల్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జె.నర్సింహారెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ మోహన్‌బాబు, ప్రిన్సిపాల్ లోకనాథం పాల్గొన్నారు. అదేవిధంగా ఎంఆర్‌సీఈ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అధ్యాపకులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. మేడ్చల్‌లోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో 14వ, వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానించారు.

కీసర/ఘట్‌కేసర్ రూరల్: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురువారం కీసర మండల కేంద్రంపలువురు ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులను పలువురు సన్మానించారు.


కీసర రూరల్: హెచ్‌ఎం రాములును సన్మానిస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

కీసర రూరల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, హెచ్‌ఎం రాములు, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: అధ్యాపకులను సన్మానిస్తున్న నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్ పరిధిలోని పోతాయిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో గురువారం మహిళాశక్తి వైవాయిస్ సంఘం అధ్యక్షురాలు హైమారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను ఉపాధాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతాయిపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమార్, ఉపాధ్యాయులు మనోహర, సంధ్యలను వై వాయిస్ సంఘం అధ్యక్షురాలు హైమారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ హరిబాబు, విద్యార్థులు వారిని సన్మానించారు. అదేవిధంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో దేవరయాంజాల్ మాజీ ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పాఠశాల హెచ్‌ఎం కళ్యాణి, ఉపాధ్యాయులు, రవిందర్‌చారి, లలిత, రాఖీ, మమతలను మాజీ ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, విద్యార్థులు అభినందిస్తూ ఘనంగా సన్మానించారు.

పరిగి ఎంపీడీవోగా కరీం

పరిగి, సెప్టెంబరు 5: పరిగి ఎంపీడీవోగా ఎండీ కరీం గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ప్రభాకర్‌రెడ్డి ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో కులకచర్ల మండల ఎంపీవోగా పనిచేస్తున్న కరీం పదోన్నతిపై పరిగికి వచ్చారు. గురువారం ఆయన పరిగి ఎంపీడీవో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ని సూపరింటెండెంట్ వరలక్ష్మి, ఎంపీవో విజయ్‌కుమార్, సుభాన్‌లు సన్మానించారు.

బీసీల కులగణన జరపాలి

వికారాబాద్, సెప్టెంబరు 5: బీసీ కులగణన జరపాలని రాష్ట్ర బీసీ సంఘం చైర్మన్ గొరిగి మల్లేష్ యాదవ్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా బీసీలకు కుల గణన జరగకపోవడం వల్ల అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం యూత్ అధ్యక్షుడు నీల వెంకటేష్, రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు అంజి, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి రవియాదవ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు సతీష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి నిందితుడిని శిక్షించాలి

వికారాబాద్, సెప్టెంబరు 5: కొమరంభీం జిల్లాలో గిరిజన యువతిపై లైంగికదాడికి పాల్పడిన ముస్లిం యువకుడిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా మోర్చా అధ్యక్షురాలు యామ్మి శిరిషా డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం బీజేపీ మహిళా మోర్చ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంరక్షణను గాలికొదిలేసి హైడ్రా అనే పేరుతో డ్రామాలు చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

కీసర రూరల్: లైంగికదాడి నిందితులను కఠినంగా శిక్షించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి డిమాండ్ చేసారు. గురువారం ఆదివాసీమహిళపై జరిగిన లైంగిక ఘటనను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. దమ్మాయిగూడ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీ, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు వేణు, నాయకులు సుజాతనాయక్, సంధ్యారెడ్డి పాల్గొన్నారు.

మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలి

కీసర రూరల్, సెప్టెంబరు 5 మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలనే పూజించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిలర్ పాండాల అనురాధ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ 12వ వార్డులో గురువారం మట్టితో తయారు చేసిన 200 గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాండాల యాదగిరిగౌడ్, యేముల దీప, రేనుక, పల్లవి, నీరజ, స్వప్న, అరవింద్, నరేందర్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని కొడంగల్ మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. హైదరాబాద్‌లో గురువారం రాష్ట్ర డీజీపీ జితేందర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, హోమ్‌స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తను మర్యాదపూర్వకంగా కలిసి మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు.

తాండూరు: తాండూరులో మట్టి వినాయకుల తయారీని తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి ప్రోత్సహిస్తున్నారు. దశాబ్ద కాలంగా తాండూరు వాసవి మహిళా సంఘం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయకులను తయారీ చేసి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా వాసవీ మహిళా సంఘం అధ్యక్షులు కొట్రిక నాగలక్ష్మి స్వయంగా మట్టి వినాయకులను తయారు చేశారు. ఫ్రెండ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతి విగ్రహాల తయారు చేయించి గురువారం పట్టణంలోని గంజ్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. శుక్రవారం(నేడు) గాంధీ చౌక్‌లో మట్టి వినాయకులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం


తాండూరు: మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


కొడంగల్: డీజీపీకి మట్టి వినాయకుడి ప్రతిమను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్

రాష్ట్రంలో వరద బాధితులకు ఫ్రెండ్స్ ఫౌండేషన్ రూ.లక్షా వెయ్యి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యేకు అందజేశారు.

ఘట్‌కేసర్: పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావణిజంగయ్యయాదవ్ అన్నారు. ఆదిలీల ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీవాణి చందేల్ ఆధ్వర్యంలో గురువారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్‌లో 100మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో స్థానికులు యాదగిరిరావు, మమతాశర్మ, నల్ల నాంగేద్రరావు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

యాలాల: వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం తాండూరులోని వినాయకులు నిమజ్జనం చేసే తాండూరు కోకట్ వాగును పరిశీలించారు. వినాయకుల నిమజ్జనం సక్రమంగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలతో వాగు నిండినందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కరుణం పురుషోత్తంరావు, సిద్రాల శ్రీనివాస్, నర్సింహులు, రవిగౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: వినాయక చవితి నేపథ్యంలో గురువారం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా, తాండూర్ సమీపంలో వినాయక విగ్రహ తయారీ కేంద్రాల నుంచి కొడంగల్, దౌల్తాబాద్ మండలంలో వివిధ గ్రామాల యువకులు విగ్రహాలను తరలించారు.

శామీర్‌పేట: శామీర్‌పేటలో మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమ సమన్వయం సమావేశాన్ని నిర్వహించారు. నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎంపీడీవో మమతబాయి, తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యాలాల: వినాయక పండుగ సందర్భంగా గ్రామాల్లో డీజేలకు అనుమతి లేదని యాలాల ఎస్ఐ శంకర్ అన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం మండల పరిధిలోని వివిధ రాజకీయ నాయకులు యువకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచులు హనుమంతు, శ్రీనివాస్, ఏఎస్ఐ యాదయ్య గౌడ్, విశ్వనాథ్‌పూర్ బస్వరాజ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **బొంరాస్‌పేట్:** బీఆర్ఎస్ సోషల్ మీడియా హెడ్ మాజీ డిజిటల్ డైరెక్టర్ కొణతం దిలీప్ అక్రమ అరెస్టు బాధాకరమని బొంరాస్‌పేట్ మండల సోషల్ మీడియా అధ్యక్షుడు నెహ్రూనాయక్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు బలవంతంగా తీసుకెళ్లి అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు.

● **దోమ:** గుండాల్ తండాలో గురువారం పోషకాహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో మోహిన్ మున్నిసా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిరా, జగనమ్మ, చంద్రకళ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు మంజుల, సుభాష్ పాల్గొన్నారు.

● **కీసర:** రాంపల్లి దాయరను గ్రామపంచాయతీగానే కొనసాగించాలని మాజీవార్డు సభ్యుడు ముక్క మహేందర్ గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. గత నెల 23వ తేదీన జరిగిన గ్రామసభలో రాంపల్లి దాయరను గ్రామపంచాయతీగానే కొనసాగించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం రాంపల్లి దాయరను నాగారంలో విలీనం చేయడం సమంజసం కాదన్నారు.

● **శామీర్‌పేట:** ప్రస్తుతం శామీర్‌పేట మండల పరిధిలో ఉన్న పొన్నాల్ గ్రామాన్ని యదావిధిగా అదే మండలంలోనే కొనసాగించాలని, మూడుచింతలపల్లిలో కలపొద్దని ఆ గ్రామ నాయకులు కోరుతున్నారు. పొన్నాల్ గ్రామ మాజీ సర్పంచ్ బత్తిని సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఆ గ్రామ నాయకులు గడ్డంరమేశ్, మ్యాడబోయిన రమేశ్, యాస్కి నాగేశ్వర్‌గౌడ్, రాఘవరెడ్డి, మధురెడ్డి, అనంతరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్‌ను కలసి వినతి పత్రాన్ని అందజేశారు.

● **పరిగి:** సేవాలాల్ సేవ జిల్లా అధ్యక్షుడు జటావత్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం పరిగిలో పలువురికి నియామకపు పత్రాలను అందజేశారు. సేవాలాల్ సేన సలహాదారుడిగా కొర్ర బాలకృష్ణను నియమించారు. పరిగితాలుకా కన్వీనర్‌గా భాస్కర్‌ను, పరిగి తాలుకా యువసేన కన్వీనర్‌గా తులసి రామ్‌నాయక్‌లను నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు శంకర్ చేతుల మీదుగా అందజేశారు.

● **నవాబుపేట:** రుణాల రెన్యూవల్ కోసం బ్యాంకుకు వెళితే కెనరా బ్యాంకు సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని రైతులు ఆరోపించారు. పూలపల్లి (నారేగూడ) కెనరా బ్యాంకులో పని చేసే ఫీల్డ్ ఆఫీసర్ శ్యామ్ రైతుల పట్ల అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని పలువురు రైతులు వాపోయారు. బ్యాంకు డీఎం చక్రధర్‌రెడ్డిని వివరణ కోరగా రైతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

● **తాండూరు రూరల్:** తాండూరు మండల పరిధిలోని 33 పంచాయతీల్లో ఓటర్ల జాబితాను సవరించాలని ఎంపీడీవో విశ్వప్రసాద్ పంచాయతీ కార్యదర్శలను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలోని కంప్యూటర్‌లో గురువారం ఓటరు జాబితాలను ఆయన పరిశీలించారు. 50పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 45,471మంది ఓటర్లను పంచాయతీ ఓటర్ల జాబితా రూపొందించి, మండలంలోని 292 వార్డులకు గాను ముసాయిదా ఓటర్ల జాబితాను తయారు చేసినట్లు తెలిపారు.

చిలుక వాగును కబ్జా నుంచి కాపాడాలి

తాండూరు, సెప్టెంబరు 5: చిలుక వాగును కబ్జా నుంచి కాపాడాలని బీజేపీ తాండూరు నియోజకవర్గ ప్రతినిధుల బృంతం కలెక్టర్‌ను కోరారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్‌ప్రతీక్ జైన్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ కుమార్, రజనీకాంత్, కృష్ణ ముదిరాజ్, అంతారం లలిత, సాహు శ్రీలత, నాగారం మల్లేశం, బంటారం భద్రేశ్వర్, బాలప్ప, లావణ్య, కిరణ్‌కుమార్, షాబుద్దీన్ పాల్గొన్నారు.

మహానేత మాణిక్ రావుకు ఘన నివాళి

తాండూరు, సెప్టెంబరు 5: తెలంగాణ తొలిదశ, ఉద్యమకారుడు, ఏపీ మాజీ మంత్రి ఎం.మాణిక్‌రావు జయంతిని తాండూరులో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌బీఎల్ వ్యవస్థాపకులు, సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు రమేష్ మహరాజ్‌ల ఆధ్వర్యంలో ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎల్ సీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు రమేష్ మహరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, పట్లోళ్ల బాల్‌రెడ్డి, సంగెం రవీందర్‌గౌడ్, ధారాసింగ్, నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదం కేసులో వ్యక్తికి ఏడాదిన్నర జైలు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబర్ 5: రోడ్డు ప్రమాదం కేసులో నిర్లక్ష్యంగా వాహనం నడిపి రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీ కొట్టి మృతికి కారణమైన వ్యక్తికి ఏడాదిన్నర జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఎల్‌బీనగర్‌లోని 5వ అదనపు మెట్రో పొలిటన్ మేజిస్ట్రేట్ మల్కాజిగిరి న్యాయాధికారి తీర్పును వెల్లడించారు. వివరాల ప్రకారం జనగాం జిల్లాకు చెందిన గుర్రం శ్రీనివాస్(29) 2018లో ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు దాటుతున్న ఓవ్యక్తిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కోర్టులో దాఖలు చేయగా నిందితుడికి ఏడాదిన్నర కఠిన కారాగార శిక్షతో రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత

ధారూరు, సెప్టెంబరు 5: మేత మేస్తున్న ఎద్దు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యాదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాతపడింది. ఈ సంఘటన మండల పరిధిలోని స్టేషన్ ధారూరు గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో గురువారం జరిగింది. స్టేషన్ ధారూరు గ్రామానికి చెందిన రైతు లాల్‌కోట గోరెప్పకు తన ఎడ్లను తీసుకుని పొలానికి వెళ్లాడు. మేతమేస్తున్న ఓఎద్దు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడింది. ఎద్దు విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు గోరెప్ప తెలిపారు.

పట్టుబడిన ఇసుక ట్రాక్టర్ సీజ్

తాండూరు రూరల్, సెప్టెంబరు 5: అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గోపన్‌పల్లి నుంచి గురువారం ఎలాంటి అనుమతి లేకుండా కరన్‌కోట్‌కు ఇసుకను తరలిస్తుండగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ యజమాని సమీర్, డ్రైవర్ తలారి నాగేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

దౌల్తాబాద్, సెప్టెంబరు 5: మండల కేంద్రానికి చెందిన కృష్ణకుమార్, బాలంపేట్‌కు చెందిన నరేశ్‌గౌడ్ ఇటీవలే ఫోన్‌ను పోగొట్టుకున్నట్లు దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు సీఈఐఆర్ యాప్ ద్వారా ఫోన్‌ల ఆచూకీ గుర్తించి ఎస్ఐ రవిగౌడ్ గురువారం బాధితులకు అప్పగించారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

పెద్దేముల్, సెప్టెంబరు 5: మండలంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ వికారాబాద్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో జర్నప్ప తెలిపారు. మండలంలోని ఓంప్లానాయక్‌తండాలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వెంకటచైతన్య ఎలాంటి సెలవులు పొందకుండానే ఇష్టానుసారంగా విధులకు డుమ్మాకొడుతున్నాడు. బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించడంలో విఫలమైనందున అతడిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఆయన స్థానంలో జయరాంతండా(ఐ)పంచాయతీ కార్యదర్శి రజితకు అదనపు బాధ్యతలు అప్పగించామని చెప్పారు. అదేవిధంగా ఇందూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా ఉన్న కె.కిశోర్ ఎలాంటి అనుమతులు లేకుండా దీర్ఘకాల సెలవులపై వెళ్లాడని, ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు విధులకు హాజరు కాకపోవడంతో అతడిని కూడా సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో తెలిపారు. ఇందూరు పంచాయతీ కార్యదర్శిగా డిప్యూటేషన్‌పై వచ్చిన బలరాంకు బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు.

వైద్యుడి టేబుల్‌పై రైల్వే బెడ్‌షీట్

● విలేకరులు ప్రశ్నించడంతో తొలగించిన డీఎంఅండ్‌హెచ్‌వో

పెద్దేముల్, సెప్టెంబరు 5: పెద్దేముల్ పీహెచ్‌సీలోని మెడికల్ ఆఫీసర్ టేబుల్‌పై సౌత్‌సెంట్రల్ రైల్వేకు చెందిన బెడ్‌షీట్ దర్శనమిచ్చింది. రైల్వేకు చెందిన ఏవస్తువు కూడా ఇతరులు తీసుకెళ్లడానికి వీల్లేదు. అలాంటిది రైలులో ప్రయాణం చేసే సమయంలో ఏసీ బోగీలో వెళ్లేవారికి ఇచ్చే బెడ్‌షీట్ ఆస్పత్రిలోని వైద్యుడి టేబుల్‌పై పరిచి ఉండడంతో అవాక్కైన విలేకరులు డీఎం అండ్‌హెచ్‌వోను ప్రశ్నించారు. దీంతో ఆయన కూడా అది ఎవరు తెచ్చారు, టేబుల్‌పై ఎవరు పరిచారని ఆస్పత్రి సిబ్బందిని ప్రశ్నించారు. అందరూ మాకు తెలియదంటే మాకు తెలియదని సమాధానమిచ్చారు. వెంటనే దానిని టేబుల్‌పై నుంచి తొలగింపజేశారు.


పెద్దేముల్ పీహెచ్‌సీ డాక్టర్ టేబుల్‌పై పరిచిన రైల్వేబెడ్‌షీట్

భారీ వర్షాలకు పత్తిపంటకు నష్టం

పూడూరు, సెప్టెంబరు 5: భారీ వర్షాలకు మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పత్తిపంట, పొలాలు ఊటపట్టి పత్తిమొక్కలు మొదళ్లతోపాటు పంట మొత్తం వాడుముఖం పట్టింది. దీంతో పంట వాడిపోవడంతో మొదలైంది. రైతులు పెట్టిన పెట్టుబడి రాకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూడూరు మండల పరిధిలోని మిట్టకంకల్, చెన్‌గోముల్, మేడిపల్లికలాన్ గ్రామాల్లో పత్తి చేనులో వర్షం నీరు అధికంగా ఉండటంతో రైతులు వాటిని చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. తక్షణమే వ్యవసాయాధికారులు పరిశీలించి పాడైన పంటకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం, నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతులు కోరుతున్నారు.


మేడిపల్లిలో వాడుముఖం పట్టిన పత్తిపంట

అలుగుపారిన లక్ష్మీనారాయణ చెరువు


అలుగు పారుతున్న లక్ష్మీ నారాయణ చెరువు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 5: మండలంలోని ఎదులాబాద్ గ్రామంలోని లక్ష్మీ నారాయణ చెరువు గురువారం అలుగుపారింది. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతంలోని నీరు చెరువులోకి రావడంతో పెద్ద ఎత్తు నీరు వచ్చి చేరడంతో ఆలుగు పారింది.

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

వికారాబాద్, సెప్టెంబరు 5: గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్‌లో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారికి గురువారం జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో జిల్లా అధికారిని కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన మోర్చ అధ్యక్షుడు గోవింద్‌నాయక్ మాట్లాడుతూ.. గిరిజన ఆశ్రమ పాఠశాలలో తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలో విద్యార్థులు కలుషిత నీరు తాగి విషజ్వరాల బారిన పడుతున్నారని అన్నారు. సిబ్బంది లేక కంప్యూటర్లు వాడకంలో లేవని కూడా తెలిపారు. ఈ సమస్యలతో విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు గోవింద్‌నాయక్, ప్రధాన కార్యదర్శి హరినాయక్, సెక్రెటరీ శంకర్ నాయక్, ఎక్సిక్యూటీవ్ సభ్యులు రాంచందర్ నాయక్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

శామీర్‌పేట, సెప్టెంబరు 5: అక్రమ నిర్మాణాలను చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని టీపీవో మణిహారిక హెచ్చరించారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో పెద్ద ఎత్తున గోదాంను నిర్మిస్తున్నారని స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ అక్రమ నిర్మాణాలపై తూంకుంట మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు స్పందించి పరిశీలించారు. తూంకుంట మున్సిపల్ కమీషనర్ వెంకటగోపాల్ ఆదేశాల మేరకు గురువారం మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో అక్రమంగా నిర్మించిన గోదాంను మున్సిపల్‌టౌన్ ప్లానింగ్ అధికారి(టీపీఓ) మణిహారిక సిబ్బందితో కలసి జేసీబీ యంత్రాలతో కూల్చివేశారు.

ధారూరు సీఐగా భీంకుమార్

ధారూరు, సెప్టెంబరు 5: ధారూరు సీఐగా బి.భీంకుమార్ బాధ్యతలు చేపట్టారు. గద్వాల సీఐగా పనిచేస్తున్న భీంకుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న రామకృష్ణ హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. సీఐ రామకృష్ణ నుంచి బుధవారం రాత్రి ఆయన బాధ్యతలు స్వీకరించారు.